సాక్షి
అనకాపల్లి
శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



ఇథనాల్ పరిశ్రమ కోరుతూ..

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజనసభ జరిగింది. చెరకు టన్నుకు రూ.2919.75 గిట్టుబాటు ధర ప్రకటించారు. 8లో



సత్వర పరిష్కారం

8లో

దేవరాపల్లిలో 'జగనన్నకు చెబుదాం' నిర్వహించారు. 176 అర్జీలు వచ్చాయి. కలెక్టర్, జేసీ వినతులు స్వీకరించారు.

మోస్తరు వర్షసూచన



అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు మోస్తరు వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న 22 మి.మీ., 1న 10, 2న 6, 3న 8, 4న 8 మి.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఉష్ణోగ్రతలు 33.7 నుంచి 33.8 డిగ్రీల వరకు నమోదవుతాయన్నారు.

చేసింది చెప్పండి.. అదే మన విజయ సూత్రం

- నాలుగున్నరేళ్ల పాలనలో అభివృద్ధిని ప్రజలకు వివరించాలి
- సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయాలి
- 'జగనన్న ఆరోగ్య సురక్ష' ద్వారా ప్రజల చెంతకే వైద్యసేవలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి




పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్

సాక్షి, అనకాపల్లి: నాలుగున్నరేళ్ల పాలనలో మన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించటం.. సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడడం.. ఇవే ఎన్నికల్లో మన విజయానికి తారకమంత్రాలని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం అనకాపల్లి టౌన్ రింగ్‌రోడ్డులో గల పెంటకోట కన్వెన్షన్ హాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతితోపాటు ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పార్టీ నియోజవర్గ పరిశీలకులు హాజరయ్యారు. వచ్చే ఎన్నికల్లో ఏ మార్గాన్ని అనుసరించాలి.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు ఎలా చేరవేయాలి అనే అంశాలపై వైవీ సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దిశానిర్దేశం చేశారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష పథకం'లో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి వివిధ రకాల సర్టిఫికేట్లు అందించడంతో మేలు జరిగిందని.. అదే తరహాలో ఈనెల 30వ తేదీ నుంచి నవంబర్ 15వ తేదీ వరకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, వివిధ పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. రోగులను వైద్య శిబిరాల వద్దకు తీసుకువచ్చే బాధ్యత గృహసారథులు, వలంటీర్లదేనన్నారు.

ఎందుకు జగనన్నే కావాలి..

'ఎందుకు ఆంధ్రకు జగనన్నే కావాలి' అనే వినూత్న కార్యక్రమాన్ని గ్రామగ్రామాన నిర్వహించాలని సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల ముఖ్య నాయకులు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలోనూ లబ్ధి పొందిన ప్రతి ఇంటిపై పార్టీ జెండా ఎగరాలన్నారు. రాత్రికి అదే గ్రామంలో బస చేసి, అక్కడే భోజనాలు చేసి గ్రామస్తులతో రచ్చబండ నిర్వహించాలని చెప్పారు. చంద్రబాబు తన హయాంలో ప్రజలను ఏ విధంగా మోసం చేసాడో కూడా ప్రజలకు చెబుతూ 'ఆపు బాబూ నాటకం... జగనే మా నమ్మకం' అంటూ నినదించి రావాలని సుబ్బారెడ్డి దిశానిర్దేశం చేశారు.

ఆరోగ్య సురక్ష ప్రతిష్టాత్మకం

మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో తొలిసారిగా తుమ్మపాలలో శనివారం నిర్వహించనున్నామని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కక్షపూరితంగా చంద్రబాబును అరెస్టు చేసి ఉంటే ఆయనకు ఎప్పుడో బెయిల్ వచ్చేదని, ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా ఆయనకు బెయిల్ ఇవ్వటం లేదంటే ఆయన దొంగ అని తేలిపోయిందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్ రాజ్, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు తీపి కబురు

- రూ.12.50 కోట్లు గ్రాంట్‌గా విడుదల చేసిన ప్రభుత్వం



చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత సీజన్‌కు సంబంధించిన చెరకు బకాయిలు, కార్మికుల జీతభత్యాల బకాయిలు చెల్లింపు కోసం రూ.12 కోట్ల 50 లక్షలను గ్రాంట్‌గా ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు అందాయి. 2022–23 క్రషింగ్‌కు సంబంధించి రైతులకు రూ.7 కోట్ల 80 లక్షల చెరకు బకాయిలు, మూడు నెలలుగా కార్మికుల జీతాలు రూ.3.75 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీటితోపాటు ఫ్యాక్టరీ నిర్వహణ కోసం మరికొంత అవసరం కావడంతో మొత్తం రూ.12.50 కోట్లు ప్రభుత్వం గ్రాంట్‌గా ఇచ్చింది. గోవాడ ఫ్యాక్టరీ గత సీజన్‌కు సంబంధించి రైతుల పేమెంట్స్ కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పరిస్థితి వివరించారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి రైతులు, కార్మికుల కోసం రూ.12.50 కోట్లు గ్రాంట్‌గా మంజూరు చేసేందుకు అంగీకరించారు. వెంటనే ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ ఉత్తర్వులు సరిగ్గా ఫ్యాక్టరీ మహా జనసభ జరిగిన రోజు శుక్రవారం నాడే రావడంతో ఆనందం వ్యక్తమవుతోంది. సభ్య రైతులు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

న్యూస్‌రీల్

16న విశాఖకు సీఎం జగన్

- ఇన్ఫోసిస్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఇన్ఫోసిస్ ప్రతినిధులు

దొండపర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వచ్చేనెల 16న విశాఖకు రానున్నారు. ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌ను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి సీఎం పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో ప్రభుత్వ అతిథి గృహంలో సమీక్షించారు. ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఈ సమీక్షలో ఇన్ఫోసిస్ మౌలిక సదుపాయాల విభాగ ప్రాంతీయ అధికారి కులకర్ణి, ఇండియా హెడ్ పునీత్ దేశాయ్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయడానికి అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య శాస్త్రం, వృక్ష శాస్త్రం సబ్జెక్టుల పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పోస్టును కూడా భర్తీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్ కలిగి, 55 శాతం పైబడి మార్కులు సాధించినవారు తమ దరఖాస్తు, ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు ఫొటోలు, జెరాక్సు కాపీలతో అక్టోబర్ 3వ తేదీ ఉదయం 11 గంటలకు నేరుగా కళాశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టులలో ఎంఫిల్, పీహెచ్‌డీ, నెట్, స్లెట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు.

డీసీఎంఎస్ ఆవరణలో జనఔషధ కేంద్రం

- డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు



మాట్లాడుతున్న చైర్మన్ పల్లా నర్సింగరావు

అనకాపల్లి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్థానిక డీసీఎంఎస్ ఆవరణలో జనఔషధ కేంద్రాన్ని ప్రారంభిస్తామని డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు తెలిపారు. స్థానిక జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లిమిటెడ్ ఆవరణలో శుక్రవారం జరిగిన 49వ మహాజనసభలో ఆయన మాట్లాడారు. తర్వలో జనఔషధ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు చెప్పారు. సంస్థ ఆవరణలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్‌కు పోలీసుల అనుమతులు తప్ప, అన్నిశాఖల అనుమతులు లభించాయని చెప్పారు. పట్టణంలో బండిగాడివీధిలో ఉన్న సంస్థ స్థలంలో గొడౌన్ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు ఆయన చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జమాఖర్చులను ఆమోదించినట్టు తెలిపారు. సంస్థ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. అంతకుముందు సంస్థ వ్యవస్థాపకుడు బొడ్డేడ అచ్చియ్యనాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్‌కు నివాళులర్పిస్తూ సభ్యులు కొంతసేపు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ ఐ.వి.రమణమూర్తి, సభ్యులు పొన్నంగి అప్పారావు, బంగారి అప్పలనర్సమ్మ, పిళ్లా దాశరథి నర్సింహరావు(గాంధీ), నందాల సుబ్రయ్య, గుమ్ముడు సత్యదేవ్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు 13కి వాయిదా

అల్లిపురం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు మరోసారి వాయిదా పడింది. 3వ అదనపు జిల్లా జడ్జి, ఏసీబీ, ఎన్ఐఏ కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్.మురళీ కృష్ణ వచ్చే నెల 13వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసును విజయవాడ ఎన్.ఐ.ఏ కోర్టు నుంచి విశాఖపట్నం జిల్లా కోర్టు ఆవరణలో గల 3వ అదనపు జిల్లా జడ్జి, ఏసీబీ, ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు నిందితుడు జనుపల్లి శ్రీనివాసరావును శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు.

స్వచ్ఛాంధ్ర సాకారానికి మీరే సారథులు

- పారిశుధ్య కార్మికులను కొనియాడిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- డ్రైనేజీ పూడిక తీసి క్లాప్‌మిత్రలకు సత్కారం
- చెత్త సేకరించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



కాలువలో పూడిక తీసి శ్రమదానం చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



క్లాప్‌మిత్రలకు కాఫీలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : పల్లెలు, పట్టణాలను మీరు శుభ్రం చేయటం వల్లే ప్రజలంతా ఆరోగ్యంగా ఉన్నారని.. మీ సేవలు వృథా పోవని.. తామంతా మీకు రుణపడి ఉన్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పారిశుధ్య సిబ్బందిని కొనియాడారు. మండల కేంద్రం దేవరాపల్లిలో 'స్వచ్ఛతా హై సేవ' కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యంపై శుక్రవారం నిర్వహించిన భారీ అవగాహన ర్యాలీలో కలెక్టర్ రవి పటాన్‌శెట్టితో కలిసి బూడి పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి పార చేతపట్టి డ్రైనేజీలో పూడిక తీసి శుభ్రపరిచారు. కలెక్టర్ రవిపటాన్‌శెట్టి సైతం చెత్త తొలగించారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పారిశుధ్య కార్మికులను (క్లాప్ మిత్రలు) డిప్యూటీ సీఎం శాలువాలతో ఘనంగా సత్కరించి రైస్ బ్యాగ్‌లు అందజేశారు. అనంతరం కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం స్వయంగా ట్రేలో కాఫీలు తీసుకెళ్లి క్లాప్‌మిత్రలకు అందజేశారు. తాగిన కాఫీ గ్లాస్‌లను సైతం ఆయన చెత్తబుట్టలో సేకరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, ఆర్డీవో ఎ. చిన్నికృష్ణ, డీపీఆర్‌సీ నాగలక్ష్మి, జిల్లా పరిషత్ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, తహసీల్దార్ ఎం. లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అండగా సీఎం జగన్



ఆటో డ్రైవర్లకు నమూనా చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- దేవరాపల్లిలో వాహనమిత్ర ఐదో విడత సాయం పంపిణీ
- జిల్లాలో 13,590 మందికి రూ. 13.41 కోట్ల లబ్ధి
- నమూనా చెక్కు అందజేత

దేవరాపల్లి: దేశంలోనే ఎక్కడా లేని విధంగా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన ఐదో విడత జిల్లా స్థాయి వైఎస్సార్ వాహనమిత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలోని 13,590 మంది వాహనమిత్ర లబ్ధిదారులైన డ్రైవర్లకు 13,41,30,000 నమూనా చెక్కును కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల సంక్షేమానికి సీఎం జగన్ పెద్ద పీట వేశారన్నారు. ఈ పథకం ద్వారా ఏటా లబ్ధిదారుడికి 10 వేల చొప్పున సాయం అందజేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో సాయం అందించగా, తాజాగా ఐదో విడత ఆర్థిక సాయాన్ని అందజేశామన్నారు. ఈ సొమ్మును ఇన్సూరెన్స్ ప్రీమియం, ఫిట్‌నెస్ ఫీజులు, రోడ్డు ట్యాక్స్ తదితర వాటికి సద్వినియోగం చేసుకోవాలని డ్రైవర్లు సూచించారు. ఈ సందర్భంగా జై జగన్, జై బూడి అనే నినాదాలతో ఆటో డ్రైవర్లు సభా వేదిక ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధ, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ కర్రి సత్యం, ఇన్‌చార్జి ఆర్టీవో ఎం.మురళీకృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, అధికార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష.. జనానికి శ్రీరామరక్ష

- నేడు అన్ని మండలాల్లో ప్రారంభం
- 45 రోజులపాటు యజ్ఞంలా నిర్వహణ
- ఒక్కో శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టులతో పాటు ఐదుగురు వైద్యులు
- ప్రతి రోగికి ఉచితంగా వైద్యపరీక్షలు, మందుల పంపిణీ



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, డీఎంహెచ్‌వో హేమంత్

సాక్షి, అనకాపల్లి: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. శనివారం నుంచి 45 రోజుల పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది.

ఈనెల 15వ తేదీ నుంచి ఇంటింటికీ జల్లెడ పట్టి జనం ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడంతోపాటు వాటిని పరిష్కరించే బృహత్తరమైన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సర్కార్ శ్రీకారం చుట్టిన సంగతి విదితమే. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్నవారి వివరాలు తెలుసుకొని, వారికి ఉచిత వైద్య శిబిరంలో చికిత్స అందించే కార్యక్రమమే జగనన్న ఆరోగ్య సురక్ష. శనివారం నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో 105 పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, 100 మంది స్పెషలిస్టు డాక్టర్లు, సచివాలయ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్ నర్సులు, ఆశా వర్కర్లు, 104 సిబ్బంది పాల్గొంటారు.

జిల్లాలో సర్వం సిద్ధం

చోడవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నుంచి నిర్వహించడానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన చోడవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. జిల్లాలో సర్వం సిద్ధంగా ఉందని వివరించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, జేసీ ఎం.జాహ్నవి, డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజులవాణి తదితరులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

వహ్వా... అద్భుతం

- ఏటికొప్పాక లక్కబొమ్మలు చూసి ఆశ్చర్యచకితులైన కేంద్ర రైల్వే సహాయ మంత్రి
- హస్తకళాకారుల నైపుణ్యానికి దర్శన జర్దోష్ ఫిదా



కేంద్రమంత్రి దర్శనకు వేంకటేశ్వరస్వామి లక్కబొమ్మను బహుకరిస్తున్న కళాకారులు, అధికారులు

యలమంచిలి: ఖండాంతర ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక లక్కబొమ్మల హొయలు చూసి కేంద్ర రైల్వే,టెక్స్‌టైల్స్ సహాయక మంత్రి దర్శన జర్దోష్ మంత్రముగ్ధులయ్యారు. ప్రకృతి సహజసిద్ధ రంగులతో హస్త కళాకారుల చేతిలో రూపుదిద్దుకున్న అందమైన లక్కబొమ్మలు కేంద్ర మంత్రిని అబ్బురపరిచాయి. నమ్మశక్యంకాని విధంగా కళాఖండాలను తయారు చేసిన ఏటికొప్పాక కళాకారులు నైపుణ్యం, సృజనాత్మకత కేంద్ర మంత్రిని కట్టి పడేశాయి. అందమైన బొమ్మలను చూసిన ఆమె కళాకారులను ప్రశంసించారు. శుక్రవారం మంత్రి దర్శన జర్దోష్ యలమంచిలి మండలం ఏటికొప్పాకలో పర్యటించి, లక్కబొమ్మల తయారీని పరిశీలించారు. ఇక్కడి కళాకారులు సృష్టిస్తున్న కళాఖండాలు ఆకట్టుకునేలా ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలించి వాటి తయారీ విధానాన్ని, వారి యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హస్తకళాకారుల కోసం విశ్వకర్మ పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు. చేతివృత్తుల కళాకారులు తాము స్వయంగా వ్యాపారాలు చేసుకుని ఉపాధిపొందేలా ఈ పథకంలో రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు అందిస్తోందని తెలిపారు. యంత్ర సామగ్రిని అందించి ప్రోత్సహిస్తోందన్నారు. అంకుడు కర్ర లభించకపోడంతో కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. రైల్వే స్టేషన్లు, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో హస్తకళలకు సంబంధించిన స్టాళ్లు, హోర్డింగ్‌లు, పోస్టర్లను ఏర్పాటు చేసి అంతర్జాతీయంగా ప్రోత్సహించడానికి కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా బిల్లును లోక్‌సభ,రాజ్యసభల్లో ఇటీవల ప్రవేశపెట్టిందని, దీనివల్ల మహిళలకు చట్టసభల్లో సేవలందించేందుకు అవకాశం లభించిందని చెప్పారు. ఏటికొప్పాకలో ఎక్కువ మంది మహిళలు లక్కబొమ్మల తయారీలో శిక్షణ పొంది ఉపాధి పొందడం హర్షించే విషయమన్నారు.

ఏటికొప్పాక కళాకారులు రాష్ట్రపతి, పద్మశ్రీ, జాతీయ స్థాయిలో పురస్కారాలు పొందడం గర్వించతగ్గ విషయమని కొనియాడారు. దేశంలో ఇప్పటి వరకు ఏ కేంద్ర మంత్రి ఏటికొప్పాక లక్కబొమ్మలను సందర్శించడానికి రాలేదని తాను ప్రత్యేకంగా కళాకారుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చానని తెలిపారు. ప్రస్తుతం ఆర్టిజన్స్‌కు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మెరుగుపరచి కళాకారులకు మెరుగైన జీవనాధారం కల్పించి, కళలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఏటికొప్పాక బొమ్మలపై మనకీబాత్‌లో ప్రధాని మూడు పర్యాయాలు మాట్లాడారన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి రాము, జేసీ జాహ్నవి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి,తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, ఏపీఎం రాణి, హస్తకళాకారుల సంఘం అధ్యక్షుడు దిమిలి రమణబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వీసం వాసు, వెలుగు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.95 కోట్లతో కేజీహెచ్ అభివృద్ధి



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కింగ్‌జార్జి ఆస్పత్రి అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేజీహెచ్ అభివృద్ధికి ప్రభుత్వ అధిక నిధులు కేటాయిస్తోంద న్నారు. ఎంఆర్ఐ స్కానింగ్, సీటి స్కాన్ పరికరం ఆస్పత్రికి చేరుకున్నాయని, మరో కొద్ది రోజుల్లో ఈ పరికరాలు వినియోగంలోకి తీసుకురానున్నామన్నారు. మొత్తం రూ.95 కోట్లతో అభివృద్ధి పనులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. రూ.20 కోట్లతో క్యాన్సర్ యూనిట్ పరికరాలు కేజీహెచ్‌కు రానున్నాయన్నారు. సోలార్ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిందన్నారు.

క్లుప్తంగా

మహిళలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

• రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఉమా



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఉమా

నర్సీపట్నం: మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు జి.ఉమా తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో పోషణ భారత్, సాక్షర భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే, మంచి ఆరోగ్యంతోపాటు చదువు ఉండాలన్నారు. మహిళల్లో పోషకాహార లోపాన్ని సమగ్రంగా పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం 6వ రాష్ట్రీయ పోషణ మా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గర్భం, బాల్యం, కౌమారదశ దశల్లో సరైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు సైతం ఆడ, మగ పిల్లల మధ్య వ్యత్యాసం చూపకూడదన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందన్నారు. ఇటీవల మహిళలకు 33 రిజర్వేషన్ సైతం తీసుకువచ్చారన్నారు. వీటి ఫలాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి మాట్లాడారు. విశాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి, కేర్ ఇండియా కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, సీడీపీవోలు జి.వి.రమణి, మేరీ సువార్త, విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఐదో విడత వైఎస్సార్ వాహనమిత్ర సాయం విడుదలపై ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మాకవరపాలెం మండలం తామరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. – మాకవరపాలెం

'జగనన్నకు చెబుదాం'తో సత్వర పరిష్కారం

• కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
• దేవరాపల్లిలో కార్యక్రమానికి విశేష స్పందన
• మండల వ్యాప్తంగా 176 అర్జీల స్వీకరణ
• వీటిల్లో 89 మేర రెవెన్యూపరమైన సమస్యలే



దేవరాపల్లిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జగనన్నకు చెబుదాంకు హాజరైన అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు

దేవరాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్నకు చెబుదాం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి అన్నారు. శుక్రవారం దేవరాపల్లి టీటీడీ కల్యాణ మండపంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వినతులను స్వీకరించి వారి సమక్షంలోనే సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. 176 అర్జీలు స్వీకరించగా, వీటిల్లో 89 వినతులు రెవెన్యూశాఖ సంబంధించినవేనని అధికారులు స్పష్టం చేశారు. అర్జీదారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పది కౌంటర్ల ద్వారా టోకెన్లను జారీ చేసి తద్వారా వినతులను స్వీకరించారు. అన్ని శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రతీ బుధ, శుక్రవారాలు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి తనతోపాటు జిల్లా స్థాయి అధికారులు సైతం హాజరై వినతులు స్వీకరించడంతోపాటు సంబంధిత శాఖల వారీగా సమీక్షించి, అనంతరం క్షేత్ర సందర్శన సైతం చేస్తున్నారన్నారు. ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ రమామణి ఆర్డీవో ఎ. చిన్నికృష్ణ, డీపీవో శిరీషా రాణి, సీపీవో జి. రామారావు, మండల ప్రత్యేకాధికారి వి.రవీంద్రనాథ్, తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

అర్జీలలో కొన్ని..

• తిమిరాం వారపు సంత (పశువుల సంత) స్థలాన్ని కొంతమంది ఆక్రమించారని, రికార్డులు ప్రకారం సర్వే చేసి వాటిని తొలగించాలని జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, చల్లా మహేష్ తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

• తామరబ్బ గిరిజన పంచాయతీలో సిగ్నల్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సెల్ టవర్ వేయించాలని సర్పంచ్ టోకురి రామకృష్ణ, గుమ్మడపు మహేష్ కోరారు.

• దేవరాపల్లిలో డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, స్థానిక ఒకేషనల్ కాలేజీలో ఎం.ఎల్.టి, ఎం.పి.హెచ్‌డబ్ల్యూ గ్రూపులు ఏర్పాటు చేయాలని ప్రజా స్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ, కొరుపోలు శ్రీను అర్జీ సమర్పించారు.

• ఎ. కొత్తపల్లిలో గ్రామ కంఠం, చెరువుల ఆక్రమణలు తొలగించాలని, గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కొంతమంది ఆక్రమించి వేరొకరికి విక్రయించారని, వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనధికార లేఅవుట్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

• తిమిరాంలో గ్రామ కంఠం స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని కొంతమంది అడ్డగిస్తున్నారని, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రెడ్డి సూర్యనారాయణ ఫిర్యాదు చేశాడు.

ప్రత్యేక ఉపకరణాలతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు



శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్



శిబిరానికి విచ్చేసిన దివ్యాంగులు

• దివ్యాంగుల గుర్తింపు శిబిరంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు ప్రత్యేక ఉపకరణాలతో వారి జీవితాల్లో వెలుగు నింపటమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. శుక్రవారం పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల ఆవరణలో సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ, అలిమ్‌కో సంస్థ సంయుక్తంగా నిర్వహించిన దివ్యాంగుల గుర్తింపు శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో దివ్యాంగుల దరఖాస్తు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పలు దఫాలు ఎంతో మంది దివ్యాంగులకు మోటార్‌బైక్, ట్రైసైకిళ్లు పంపిణీ చేశామన్నారు. దైనందిన జీవితంలో ఇబ్బంది పడుతున్న మిగిలిన వారి కోసం ప్రభుత్వం అండగా నిలిచి ఉచితంగా ఉపకరణాలు అందిస్తుందన్నారు. ఎంపీ బీవీ సత్యవతి కృషి ఫలితంగా గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో అనకాపల్లి, చోడవరంలో నిర్వహించిన శిబిరాల్లో 400 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వారికి యూడీఐడీ గుర్తింపు కార్డులను నమోదు చేసి, అవసరమైన పరికరాలను మంజూరు చేస్తామన్నారు. శిబిరానికి నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ, కోటవురట్ల, రోలుగుంట, నర్సీపట్నం మున్సిపాలిటీ నుంచి 800 మంది దివ్యాంగులు హాజరు కాగా, వారిలో 350 మందిని అర్హులుగా గుర్తించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జగదీష్, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, మెప్మా పీడీ సరోజిని, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, ఎంపీడీవో జయమాధవి, ఆరు మండలాల ఎంపీడీవోలు, వెలుగు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసవ సేవల్లో ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలోనే ప్రథమం

• వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు



వైద్యులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు

నర్సీపట్నం: ప్రసవ సేవలు అందించడంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. అత్యవసర విభాగంతోపాటు వార్డులు, ప్రసూతీ విభాగాన్ని పరిశీలించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయకల్ప అవార్డుకు రాష్ట్రంలో 13 ఆస్పత్రులు ఎంపిక కాగా, నర్సీపట్నం ఆస్పత్రి ప్రథమ స్థానంలో ఉందన్నారు. కాయకల్ప అవార్డు వల్ల ఆస్పత్రికి రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఖాళీ వైద్యులు, వైద్య సిబ్బందికి నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మెరుగైన సేవలందించేలా సిబ్బందికి మార్గదర్శకాలు చేస్తామన్నారు. ఆస్పత్రికి అవసరమైన వాటి గురించి సూపరింటెండెంట్ నీలవేనిదేవిని అడిగి తెలుసుకున్నారు.

3న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

అనకాపల్లి టౌన్: మండలంలోని రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే నెల 3న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆరోజు ఉదయం 10 గంటలకు విద్యార్థులు హాజరు కావాలన్నారు. పాలిసెట్-2023 రాసి సీటు రానివారు, సీటు వచ్చి కళాశాలలో చేరని వారు, పదో తరగతి పాసై, పాలిసెట్ రాయని వారు దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు. సీటు పొందిన వారు మొత్తం ఫీజును తక్షణమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి ఉపకారవేతనం రాదని, మూడేళ్ల పూర్తి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర కళాశాలలో ఇదివరకే ప్రవేశం పొందిన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనే అవకాశం లేదన్నారు. వివరాలకు 9441346598 సంప్రదించాలని సూచించారు.

నవంబరులోగా 30 లేగదూడల ప్రదర్శనలు

• ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి రామ్మోహన్‌రావు



పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నాతవరం: ఉమ్మడి జిల్లాలో 20పైగా లేగదూడల ప్రదర్శనలు నిర్వహించి రైతులకు ప్రోత్సాహకాలు అందించామని, నవంబరులోగా మరో 30 ప్రదర్శనలు నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామ్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని గుమ్మడిగొండలో లేగదూడల ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ ఉండాలన్నారు. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని కృత్రిమ గర్భధారణ ద్వారా సంకరజాతి పశువుల అభివృద్ధిని ప్రోత్సహిస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆడపెయ్యిలు జన్మించేందుకు 3,500 ఇంజక్షన్ల సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇంజక్షన్ ఖరీదు రూ.1350 కాగా, ప్రభుత్వం రాయితీపై రైతుకు రూ.500కే సరఫరా చేస్తుందన్నారు. ఇంతవరకు 2,500పైగా ఇంజక్షన్లు పశువులకు చేశామని, మిగిలినవి వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేస్తామన్నారు. ఇంతవరకు ఇంజక్షన్లు చేసిన పశువులకు 45పైగా ఆడపెయ్యిలు జన్మించాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 197 మంది గోపాలమిత్రులు వీటిని వేస్తున్నారన్నారు. అనంతరం పాడి రైతులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ పాయకరావుపేట ఏడీ శ్రీనివాస్, విశాఖ డైయిరీ నర్సీపట్నం పాల కేంద్రం మేనేజరు సిహెచ్. సత్యనారాయణ, గోపాలమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ, పశువైద్యాధికారి బి. సంధ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు సుర్ల అచ్చియ్యానాయుడు, గోపాలమిత్రులు పాల్గొన్నారు.

గుండె ఆరోగ్యానికి శారీరక శ్రమ అవసరం



మాట్లాడుతున్న కార్డియాలజిస్ట్ బారువ

ఆరిలోవ: గుండె సంబంధిత వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని అపోలో ఆస్పత్రి కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ బారువ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అపోలో సీవోవో రామచంద్రరావు ఆధ్వర్యంలో శుక్రవారం బీచ్‌రోడ్డులోని కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. సాయంత్రం ఆస్పత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్డియాలజిస్టులు త్రివేది, చక్రవర్తి, శశాంక్, రవికాంత్ తదితరులతో కలసి గుండె సంబంధిత వ్యాధులు–వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ బారువ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి వృద్ధుల వరకు గుండె సంబంధిత వ్యాధులకు గురవుతున్నారన్నారు. బీపీ, మధుమేహం ఉన్నవారితో పాటు జన్యుపరమైన సమస్యలు ఉన్న వారిలో ఎక్కువగా ఈ వ్యాధులు వస్తున్నట్లు తెలిపారు.

ఈ వ్యాధులకు గురైన వారు ఆహార అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, ధ్యానం చేయడం, నడక, ఆటలు అవసరమని వివరించారు. 20 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఆరు నెలల నుంచి ఏడాది కాలవ్యవధిలో ఒక సారి గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఇందుకోసం అపోలోలో రూ.999 నుంచి రూ.4,999 వరకు ప్యాకేజీ ఉందన్నారు. అక్టోబర్ 29 వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భార్యపై దాడి కేసులో భర్తకు రెండేళ్ల జైలు శిక్ష

బుచ్చెయ్యపేట: భార్యపై దాడి చేసిన కేసులో భర్తకు రెండేళ్ల జైలుశిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ కె. కుమారస్వామి శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని వడ్డాది గ్రామానికి చెందిన బొత్స మాధవ్, నాగమణిలకు 23 ఏళ్ల క్రితం వివాహమైంది. అచ్యుతాపురం బ్రాండిక్స్‌లో పని చేస్తు న్న ఆమెపై భర్త అనుమానం పెంచుకుని తరుచూ వేధించేవాడు. ఏప్రిల్ 8న వడ్డాది నుంచి బ్రాండిక్స్‌కు వెళ్తున్న భార్యపై గొడ్డలి కర్రతో తలపై దాడి చేసి గాయపరిచాడు. తనను చంపాలని దాడి చేసిన భర్తపై చర్యలు తీసుకోవాలని అప్పట్లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ముద్దాయిపై 307, 498ఏ ఐపీసీ సెక్షన్ కింద కేసు దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ పై విధంగా తీర్పు చెప్పారు. ప్రభుత్వ తరఫున అడిషనల్ పీపీ వేచలపు వెంకటరావు ఈ కేసు వాదించారు.

ఇథనాల్ పరిశ్రమ కోరుతూ మహాసభ తీర్మానం

• ఈ ఏడాది చెరకు టన్నుకు రూ.2919.75 గిట్టుబాటు ధర ప్రకటన
• సజావుగా సాగిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మహాజనసభ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

చోడవరం: జోరున వర్షం కురుస్తున్నా సభ్యరైతులు మాత్రం ఎక్కడా చెదరలేదు. మహాజనసభలో తమ సమస్యలు చెప్పుకోవడంతోపాటు ఫ్యాక్టరీ మనుగడపై భవిష్యత్ ఆశలపై ఏకాభిప్రాయంతో మద్దతు పలికారు. ప్రధానంగా రానున్న రోజుల్లో ఫ్యాక్టరీ మనుగడ సాగాలంటే ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు ఒక్కటే దిక్కని, ఈ పరిశ్రమల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాజనసభలో ఏకాభిప్రాయంతో తీర్మానించారు. గోవాడ సహకార చక్కెర కర్మాగారం మహాజన సభ ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం జరిగింది. వేలాదిమంది రైతులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు భారీ వర్షం కురిసింది. సభ వద్ద వేసిన కుర్చీలను తలపై పెట్టుకొని మరీ సభలో రైతులు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు వార్షిక నివేదికను చదివి వినిపించగా పర్సన్ ఇన్‌చార్జి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధ్యక్షత వహించిన ఈ సభలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. ముందుగా పలువురు రైతులకు సభలో మాట్లాడేందుకు అనుమతి ఇచ్చారు. వ్యవసాయ పెట్టుబడులు బాగా పెరిగిపోయినందున చెరకు మద్దతు ధర పెంచాలని, టన్నుకు రూ.3200 నుంచి 3500 వరకు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. చెరకు బకాయిలు పేరుకుపోతున్నాయని మరికొంత మంది రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

ఓవరాయిలింగ్ పనుల్లో ఖర్చులు తగ్గించాలని, గత సభలో లేవనెత్తిన అంశాలపై విచారణ వివరాలు సభ ముందు పెట్టాలని కొందరు డిమాండ్ చేశారు. విచారణ వివరాలు కావలసిన రైతులకు లిఖితపూర్వంగా తెలియజేస్తామని జిల్లా కలెక్టర్ బదులిచ్చారు. ఓవరాయిలింగ్ పనులకు ముందుగా ఆడిట్ చేసిన తర్వాతే ఖర్చు చేయడం జరుగుతుందని, ఖర్చులు తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన వివరించారు. 2023–24 సీజన్‌కు రూ.107. 67 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా బడ్జెట్ రూపొందించారు. గతేడాది టన్నుకు రూ.2821.25 ఇచ్చామని, కేంద్రం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఈ ఏడాది చెరకు టన్నుకు రూ. 2,919 రూపాయల 75 పైసలు ఇస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు.

రైతులు, కార్మికులు నడిపించాలి

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ రైతులు, కార్మికులు కలిసి ఫ్యాక్టరీని నడిపించాల్సిన బాధ్యత ఉందన్నారు. చెరకు విస్తీర్ణం తగ్గిపోవడంపై రైతులు చర్యలు తీసుకోవాలని, రసాయన ఎరువులకు వినియోగించకుండా చెరకు సాగు మరింతగా పెంచి మంచి దిగుబడి సాధించాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఆనాడు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి గ్రాంట్ రూపంలో నిధులు ఇచ్చి కాపాడారని, మరలా ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో అప్పుల ఊబిలోంచి బయటకు తీసుకొచ్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. ఇథనాల్ పరిశ్రమను రూ.102 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని, ఇప్పటికే పర్యావరణ అనుమతులు ఇవ్వడం, డీపీఆర్ సిద్ధం చేసేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

అప్పుల ఊబిలోకి నెట్టిన టీడీపీ

సభలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ టీడీపీ ఐదేళ్లపాలనలో ఫ్యాక్టరీని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఇప్పటి వరకూ రూ.115 కోట్లు అప్పులు తీర్చామని, మిగతా రూ.45 కోట్లు కూడా తీర్చేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నామన్నారు. గత రెండు సీజన్ల నుంచీ ఎక్కడా అప్పు తేకుండా పంచదార, మొలాసిస్, కరెంటు అమ్మకాలతో వచ్చిన డబ్బులతోనే రైతులకు పేమెంట్స్ ఇవ్వడం జరిగిందన్నారు. పంచదార ఉత్పత్తికి క్వింటాకు రూ.4,400 ఖర్చవుతుందని, అమ్మితే రూ.3,300 వస్తుందని, అందుకే రైతులకు ఆశించిన మేర గిట్టుబాటు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు.

త్వరలో సీఎం చేతుల మీదుగా ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నామన్నారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ కాకుండా డిస్టలరీ యూనిట్ పెడితే బాగుంటుందన్నారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి అంతా సమష్టిగా పనిచేద్దామన్నారు.

క్లుప్తంగా

ముగిసిన దుర్గమాంబ పుట్టుక ఉత్సవం



తలపై బోనాలతో మహిళల కోలాటం

కశింకోట : కశింకోటలోని గవరపేటలో వెలసిన దుర్గమాంబ పుట్టుక ఉత్సవం శుక్రవారం తెల్లవారు జామున ఘనంగా ముగిసింది. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి ఊరేగింపు ఉత్సవంలో నిర్వహించిన మహిళల కోలాటాలు ఆహూతులను విశేషంగా అలరించాయి. ఇదిలా ఉండగా దుర్గమాంబ గరగలను పల్లకిలో ఊరేగించిన అనంతరం తెల్లవారు జామున స్థానిక ఆలయంలో నిలిపి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో ఉత్సవాన్ని నిర్వహించారు. ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి సిబ్బందితో పర్యవేక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు అనూహ్య స్పందన

అనకాపల్లిటౌన్ : జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పట్టణంలో ఇంటింటి సర్వేకు ప్రజల నుంచి అనూహ్య వస్తోంది. స్థానిక ఏఎంసీకాలనీలో శుక్రవారం ఏఎన్ఎంలు నిర్వహించిన పరీక్షలను కాలనీవాసులు సద్వినియోగం చేసుకున్నారు. శనివారం ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు హాజరై ఆరోగ్య సమస్యలు తెలుసుకోనున్నారు.

సేదదీర్చిన వాన



తోటాడ జాతీయ రహదారిపై వర్షం నీటిలో సాగిపోతున్న వాహన చోదకుడు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో రోడ్డుపై నడవాలంటే ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే సాయంత్రం 3.30 గంటలకు సుమారు 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో పట్టణవాసులు ఊపిరి పీల్చుకున్నారు. శ్రీరామ్‌నగర్, విజయరామరాజుపేట, లక్ష్మీదేవిపేట, బర్మాకాలనీ, ఆర్టీసీ కాంప్లెక్స్, గవరపాలెం ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అనకాపల్లి సినిమాలు

పెదకాపు	: రాజా
స్కంద	: సత్యనారాయణస్క్రీన్-1
సప్త సాగరాలు దాటి	: సత్యనారాయణస్క్రీన్-2
జవాన్ (మార్నింగ్, మ్యాట్నీ)	
మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి (ఫస్ట్ షో, సెకండ్ షో)	: షిర్డిసాయి
స్కంద	: పర్తిసాయి
ఖుషి	: వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
చంద్రముఖి 2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 455 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,260	4,510
రెండో రకం	4,000	4,210
మూడోరకం	3,920	4.130

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఏ' పాజిటివ్-12 యూనిట్లు, 'బి' పాజిటివ్-27 యూనిట్లు, 'ఒ' పాజిటివ్-23 యూనిట్లు, 'ఏబి' పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 390 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 206 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

డిజిటల్ చెల్లింపులదే హవా

నిన్న మొన్నటి వరకూ పెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు నేడు చిన్న వ్యాపారులు, తోపుడు బళ్ల వ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే దర్శనమిస్తున్నాయి.

- క్రమంగా తగ్గుతున్న నగదు లావాదేవీలు
- ఇంట్లో కూర్చునే షాపింగ్ చేసే సౌలభ్యం



సమోసాల బండికి అతికించిన క్యూఆర్ కోడ్



అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద పండ్ల వ్యాపారి ఏర్పాటు చేసుకున్న క్యూఆర్ కోడ్

అనకాపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేసిన తర్వాత డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రయత్నించినా అప్పట్లో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపించలేదు. షాపింగ్ మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరిగేవి. అప్పట్లో ఆన్‌లైన్ చెల్లింపుల వల్ల తమ ఖాతాల్లో నగదు ఇతరుల ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహ, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న భయంతో చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఆన్‌లైన్ చెల్లింపుల జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ కారణంగా నగదు రహిత లావాదేవీల్లో గణనీయమైన మార్పులు ప్రారంభమయ్యాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, కూరగాయలు, పండ్లు, పెట్రోల్ వంటి నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు డీటీహెచ్, మొబైల్ రీచార్జి, విద్యుత్, గ్యాస్ బిల్లులు యాప్ ద్వారానే సాగిపోతున్నాయి. అనకాపల్లి పట్టణంలో ప్రధాన వీధులు మొదలుకుని అన్ని చోట్లా డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. బజ్జీల బళ్లు, పాలు, బటర్ మిల్క్, పానీపూరీ, చాట్ బళ్లు, టీస్టాళ్లు, భోజన హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు, జ్యూస్ సెంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ స్టిక్కర్లతో మెజార్టీ లావాదేవీలు జరిగిపోతున్నాయి. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా నగదు రహిత లావాదేవీలు జరుపుతున్న వారిలో యువత ముందు వరుసలో ఉండగా, వృద్ధులు సైతం డిజిటల్ చెల్లింపులను విరివిగా వినియోగించడం విశేషం. ఏడాది క్రితం సంక్రాంతి పండగ సమయంలో గంగిరెద్దు ఆడించే డూడూ బసవన్న ఒకరు ఎద్దు తలకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసిన ఫొటోను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి దేశంలో డిజిటల్ చెల్లింపులు పెరిగాయనడానికి ఇదే నిదర్శనమని పేర్కొన్నారు. డిజిటల్ చెల్లింపుల వలన ప్రధానంగా చిల్లర సమస్య ఉండదని చిరు వ్యాపారులు పేర్కొంటున్నారు.

క్షణాల్లో క్యూఆర్ కోడ్ బోర్డులు..

పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా ఇవి కనిపిస్తున్నాయి. అయితే ఆన్‌లైన్ చెల్లింపులు సులువే అయినా ఆదమరిస్తే మోసాలకు కూడా ఆస్కారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిపై అవగాహన లేనివారిని లక్ష్యంగా చేసుకుని మాయగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. అయితే కొత్తగా మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్సులు వీటికి చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపులు జరగ్గానే దుకాణదారుడికి, కస్టమర్‌కి ఎంత మొత్తం జమ అయిందో ఆడియో వాయిస్ ద్వారా వినిపిస్తుంది. తద్వారా మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులే ఎక్కువ..



నేను చాట్ బండి నిర్వహిస్తున్నాను. నా దగ్గరకొచ్చే విద్యార్థులు, యువకులు, ఇతర కస్టమర్లు ఆన్‌లైన్ చెల్లింపులే చేస్తున్నారు. ప్రస్తుతం ప్రజల్లో ఎక్కువ శాతం ఆన్‌లైన్ చెల్లింపులకు బాగా అలవాటు పడ్డారు. ఆన్‌లైన్ చెల్లింపుల వలన చిల్లర సమస్య కూడా తొలగిపోయింది. భవిష్యత్తులో డిజిటల్ చెల్లింపులు మరింత పెరిగే అవకాశం ఉంది.

– మరడ రాము, చాట్ బండి నిర్వాహకుడు, అనకాపల్లి

బ్యాగులో సొమ్ము లేకపోయినా షాపింగ్..



గతంలో బ్యాగులో క్యాష్ పెట్టుకుని బజారుకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం డిజిటల్ పేమెంట్ల వలన బ్యాగులో నగదు లేకపోయినా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యాప్‌లు లేదా క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేస్తున్నాం. మగవాళ్ల కంటే మహిళలకు ఇది చాలా సౌకర్యంగా ఉంది. నగదు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండటంలేదు.

– కె. పద్మ, చెరకాం

దేవాలయానికి ఫర్నిచర్ అందజేత



సత్యనారాయణస్వామి దేవాలయానికి ఫర్నిచర్ అందజేస్తున్న కర్రి రుద్రినాయుడు

అనకాపల్లిటౌన్ : ప్రతి వ్యక్తి సంపాదించిన దానిలో కొంత నిరుపేదలకు, దేవాలయాలకు అందించాలని సుంకరమెట్ట సత్యనారాయణ, సూర్యనారాయణస్వామి దేవాలయాల చైర్మన్ కె.ఎం.నాయుడు అన్నారు. స్థానిక దేవస్థానం ఆవరణలో స్వర్గీయ కర్రి జగన్నాథరావు జ్ఞాపకార్థం రూ.20 వేలు విలువ చేసే ఫర్నిచర్, కుర్చీలు శుక్రవారం ఆయన దేవాలయ ఈవో ఆదినారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. మానసిక ప్రశాంతతకు దైవభక్తి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు చంద్రకళ, పెంటకోట అప్పలనాయుడు, తగరంపూడి నర్సింగరావు, మారిశెట్టి శ్రీనివాసరావు, తాడి నాగలక్ష్మి, విజ్జపు ముకుంద, ఎం.విద్యాసాగర్, కుర్చీల దాత కర్రి రుద్రినాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో చక్కటి ఆరోగ్యం



అంబేద్కర్‌నగర్‌లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్న జెడ్సీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : ఆరోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని జెడ్సీ ఎస్.వెంకటరమణ అన్నారు. జీవీఎంసీ 80వ వార్డు పరిధి అంబేద్కర్ నగర్‌లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉందని, ఉదయం, రాత్రి సమయాల్లో వేడి నీరు మాత్రమే తాగాలన్నారు. శరీరంలో నలతగా ఉంటే దగ్గరలోని వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఆహారం తీసుకునే సమయంలో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త వేరు చేసి అందించాలన్నారు. రహదారులు, కాలువలపై చెత్త వేస్తే దోమలు వృద్ధి చెంది, దోమ కాటుకు గురి కావలసి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ గణేష్, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

అనకాపల్లిటౌన్ : జీవీఎంసీ విలీన గ్రామం కేఎన్ఆర్ పేట శ్రీ సీతారామాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా ఉచిత సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం శుక్రవారం నిర్వహించారు. విశాఖ జిల్లా హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 30 మంది దంపతులు స్వామివారి వ్రతంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులు చల్లా సూర్యనారాయణ, పి.వి.రామారావు, అర్చకులు లక్ష్మీనారాయణ, సీతారామ మహిళా సేవా సంఘం వ్యవస్థాపకుడు చూచుకొండ రమణ, దంపతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



పెదిశెట్టి గోవిందు



మందపాటి జానకిరామరాజు



మలసాల కిశోర్

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈమేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి మండల పార్టీ అధ్యక్షునిగా పెదిశెట్టి గోవిందు, పట్టణ పార్టీ అధ్యక్షునిగా మందపాటి జానకిరామరాజు, కశింకోట మండల అధ్యక్షునిగా మలసాల కిశోర్‌లను నియమించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ఏర్పాట్లు పూర్తి



శిబిరం నిర్వహణపై చర్చిస్తున్న ఎంపీడీవో రవికుమార్, వైద్యుడు రమేష్

కశింకోట : మండలంలో మొదటిగా జమాదులపాలెం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరగనుంది. తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమాదులపాలెంతో పాటు సచివాలయ పరిధిలో ఉన్న వినన్నపేట, రామన్నపాలెం గ్రామాలకు చెందిన సుమారు 200 మందికి వైద్య, ఆరోగ్య సేవలందించడానికి ఏర్పాట్లు చేసినట్లు తాళ్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి యు. రమేష్ తెలిపారు. శిబిరంలో తమ పీహెచ్‌సీ, కశింకోట పీహెచ్‌సీ వైద్యులతో పాటు విశాఖ కేజీహెచ్ నుంచి ఇద్దరు నిపుణులు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా రోగుల రుగ్మతలను అనుసరించి అవసరమైన మేరకు ఏడు రకాల పరీక్షలు చేస్తామని తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి జిల్లా ఆస్పత్రులకు సిఫారసు చేస్తామన్నారు. ఈ శిబిరంలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సచివాలయ పరిధిలో ముందుగా ఇంటింటి ప్రాథమిక సర్వే నిర్వహించి రుగ్మతలు గుర్తించిన సుమారు 200 మంది రోగులకు శిబిరానికి హాజరు కావాలని టోకెన్లు పంపిణీ చేశామన్నారు. 105 రకాల మందులు అందుబాటులో ఉంచామన్నారు. వీరితో పాటు ఇతరులు కూడా వచ్చి వైద్య సేవలు పొందవచ్చన్నారు. వైఎస్సార్ ఆసరా, ఆరోగ్యశ్రీ కార్యక్రమాలపై ఈ సందర్భంగా అవగాహన కల్పిస్తామన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారన్నారు. మండల ఎంపీడీవో వి.వి. రవికుమార్ ఏర్పాట్లను పరిశీలించారు.

మహా జనసభ నేడు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం శ్రీ గౌరీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహా జనసభ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వి.వి.రమణ సహకార భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం చైర్మన్ కాండ్రేగుల కృష్ణ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో 2022-23 సంవత్సరానికి సంబంధించి సంఘం లావాదేవాలు, 2023-24 ఏడాదిలో చేపట్టాల్సిన అంశాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. సంఘం సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

డైట్‌లో స్మార్ట్ ఇండియా ఫ్రీ హాక్తాన్

అనకాపల్లిటౌన్ : డైట్ కళాశాలలో స్మార్ట్ ఇండియా ఫ్రీ హాక్తాన్ శుక్రవారం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆవిష్కరణ, సృజనాత్మకతలను పెంపొందించడానికి ఇటువంటి ప్రయోగాలు దోహదపడతాయన్నారు. అందరికీ అందుబాటు ధరల్లో ఎక్కడి నుంచైనా వినియోగించుకునేలా ఉండాలని విద్యార్థులు రక రకాల ఉత్పత్తులను తయారు చేయడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవరచుకోవాలి



మన మట్టి-మన దేశం కార్యక్రమంపై ర్యాలీ నిర్వహిస్తున్న డీపీఎన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థులు

కశింకోట : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని కశింకోట డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్‌ఎం ఎం.ఆర్.వి.అప్పారావు విద్యార్థులను కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో దేశ భక్తిని పెంపొందించడానికి 'మన మట్టి-మన దేశం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా మన మట్టి-మన దేశం'ప్రాధాన్యతను వివరిస్తూ ప్లకార్డులు పట్టుకొని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆచంట రవి, కాండ్రేగుల అప్పారావు, భీశెట్టి ఆనంద్, పి.వి. ప్రభాకర్, సూర్యారావు, బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బాలికల హైస్కూలులోను మన మట్టి-మన దేశం కార్యక్రమంపై అవగాహన కల్పించడంతోపాటు బాలికలకు చిత్ర లేఖనం, వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీ రెండో వార్డు కోనా వసంతకుమారి ప్రసవం సమయంలో వెయిట్‌లాస్‌తో పుట్టిన పిల్లలు అనారోగ్యం బారినపడ్డారు. పిల్లలకు ఆపరేషన్ చేయించడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.20 లక్షల చెక్కును స్థానిక క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ సిరసపల్లి నాని, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు



రింగ్‌రోడ్డు వరసిద్ధి వినాయక మందిరంలో రత్నాకర్‌ను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



భవానీ కాలనీ గణేష్ ఉత్సవాల్లో అన్నప్రసాదం వడ్డిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ఈ ఏడాది గణపతి నవరాత్రులు ఘనంగా జరిగాయని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడిని ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. అంతకుముందు కమిటీ సభ్యులు రత్నాకర్‌ను ఘనంగా సత్కరించారు. విజయరామరాజుపేట వరసిద్ధి గణనాథుడిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారభించారు. మసీదువీధి విఘ్నేశ్వరుడిని దర్శించుకొని మధ్యాహ్నం అన్నసంతర్పణను ప్రారంభించారు. పార్టీ నేతలు కొణతాల భాస్కర్, జేజీబాబు పాల్గొన్నారు.

కశింకోట..

కశింకోట : స్థానిక భవానీ కాలనీలో వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు. వైఎస్సార్ సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ స్వామివారినిదర్శించుకుని వినాయకునికి పూజలు చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్‌ను సత్కరించారు. కమిటీ ప్రతినిధులు కె.యేసు, బి. మిథిన్, ఎస్. గణేష్, ఎ. పవన్, ఎస్.హరి, ఎస్.సాగర్, ఐ.లోవ, జె. రూపేష్, జె.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేట్లు పెంచాలని ఆర్టీసీ కూలీల ధర్నా



ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కూలీలు

అనకాపల్లి రూరల్ : కూలీ రేట్లు పెంచాలని కోరుతూ ఆర్టీసీ లైసెన్స్ కూలీలు శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ పార్శిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో పాల్గొన్న కూలీలు తమకు ప్రస్తుత కూలీ రేట్లు గిట్టుబాటు కావడం లేదని వెంటనే ధరలు పెంచాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు కోన లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో, బస్టాండులో పనిచేసే లైసెన్సు కూలీలకు కాలపరిమితి ముగుస్తున్నా కూలీ ధరల పెంపుపై ఇప్పటి వరకు అధికార యంత్రాంగం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కార్గో లైసెన్సు కూలీల సంఘం నాయకులు పైల తాతబాబు, కె లక్ష్మణ, జి. నాయుడు, జి. అప్పలనాయుడు, ఎన్. శ్రీనివాస్, ఎ. కృష్ణ, ఎం. రమణ, కె. అప్పారావు, ఎ. ఈశ్వర్రావు, టి. నాయుడు, జి. దేముడు, సాంబ, శ్రీను పాల్గొన్నారు.

భోగలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ.64,574

అనకాపల్లిటౌన్ : స్థానిక భోగలింగేశ్వరస్వామి హుండీ లెక్కింపు ఆలయ ఆవరణలో శుక్రవారం జరిగింది. ఏడు నెలలకుగాను స్వామివారికి రూ.64,574 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కె.ఆదినారాయణ చెప్పారు. ఆర్‌వీఎస్ఎస్ గౌరీ వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ధర్మకర్తలు తాతయ్యలు, కొణతాల కృష్ణంరాజు పాల్గొన్నారు.

జోగారావుపేటలో జగనన్న ఆరోగ్య సర్వే



జోగారావుపేటలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కశింకోట : మండలంలోని పేరంటాలపాలెం శివారు జోగారావుపేట గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవసరమైన వారికి ఆరోగ్య పరీక్షలు చేసి రోగులను గుర్తించారు. వచ్చే నెల 3న కశింకోట బాలికల హైస్కూలులో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరు కావాలని టోకెన్లు పంపిణీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, హెల్త్ అసిస్టెంట్ సుభాని, ఆశ కార్యకర్త కుమారి పాల్గొన్నారు. అలాగే తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, బయ్యవరం, కశింకోట, వెదురుపర్తి సచివాలయాల పరిధిలో కూడా ఆరోగ్య సిబ్బంది సర్వే నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు కొరువాడ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం కమలాకుమారి, పీడీ దేముళ్లు

కె.కోటపాడు: అండర్-17 కబడ్డీ జిల్లా జట్టుకు కొరువాడ హైస్కూల్ విద్యార్థి సిహెచ్ రామారావు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న మాకవరపాలెంలో జరిగిన కబడ్డీ పోటీల్లో రామారావు ప్రతిభ చూపి జిల్లా కబడ్డీ జట్టులో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. జిల్లా జట్టు తరపున త్వరలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్న విద్యార్థి రామారావును ప్రధానోపాధ్యాయిని కమలాకుమారి, ఫిజికల్ డైరెక్టర్ దేముళ్లు శుక్రవారం అభినందించారు.